## క్లుప్తంగా

### రామభక్తుల పాదయాత్ర



పాదయాత్రలో భక్తులు

జూలూరుపాడు: ధనుర్మాసం సందర్భంగా జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాలకు చెందిన రామభక్తులు ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలం నాచారం అద్భుత శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధికి శనివారం పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ... గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### శిక్షణ సర్టిఫికెట్లు అందజేత..





సర్టిఫికెట్ అందుకుంటున్న శివపార్వతి, సాధిక్‌పాషా

కొత్తగూడెంటౌన్: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మిడియేషన్ అండ్ ఆర్బిటేషన్ సెంటర్‌లో న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. కొత్తగూడెంకు చెందిన న్యాయవాదులు ఆడపాల శివపార్వతి, మహ్మద్ సాధిక్‌పాషా శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### సర్క్యులర్ జారీ చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు పరిశ్రమల్లో ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు పోస్టు రిటైర్డ్‌మెంట్ కంట్రిబ్యూటరీ మెడికల్ స్కీం (సీపీఆర్ఎంఎస్–ఎన్ఈ) అమలుకు సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయాలని బీఎంఎస్ నాయకుడు పి.మాధవనాయక్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాయ్‌పూర్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో ఇప్పటి వరకు స్కీమ్‌లో చేరని వారు నుంచి రూ.60 వేలు చెల్లిస్తే రూ.8 లక్షల విలువైన వైద్యసేవలు పొందేలా బోర్డు నిర్ణయించిందని తెలిపారు. అయితే గడువు మార్చి 31వరకే ఉన్నా సింగరేణి యాజమాన్యం ఇప్పటికీ సర్క్యులర్ జారీ చేయలేదని పేర్కొన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు సమీక్షించాలని కోరారు.

### మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: టీయూసీఐ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈ నెల 19న మహబూబాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి యాకూబ్ షావలీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఇల్లెందులో పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు ఉండగా రూ.15 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, కుమార్, వెంకన్న, మహేష్, సంపత్, రాజేష్, జలంధర్‌రెడ్డి, వీరస్వామి, కొమరయ్య, శంకర్, రాజు పాల్గొన్నారు.

### నేడు చెక్కుల పంపిణీ

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే కాంప్ కార్యాలయంలో ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పంపిణీ చేయనున్నట్లు వైరా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులతోపాటు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

### 18న ఇఫ్టూ విలీనసభ

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 18న కొత్తగూడెంలో జరగనున్న ఇఫ్టూ విలీనసభను జయప్రదం చేయాలని ఇఫ్టూ కార్యదర్శి రాసుద్దీన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కొత్తగూడెంలోని జిల్లా కేంద్ర కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్ విధానాలకు అనుగుణంగా కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నాయన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని, ఇందులో భాగంగా కొత్తగూడెంలో జనవరి 18న జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ పిలుపునిచ్చిందన్నారు. గౌని నాగేశ్వరరావు, సంజీవ్, మోత్కూరి మల్లికార్జున్, వెంకన్న, వాసు, శరత్, గడ్డం నగేష్, సురేష్ పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: ముగ్గులు వేస్తున్న యువతులు



విక్రయానికి సిద్ధంగా పతంగులు



పిండివంటలు చేస్తున్న మహిళలు



జూలూరుపాడు: పల్లెల్లో సందడి చేస్తున్న బసవన్న

# సంక్రాంతి వచ్చె.. సంబురాలు తెచ్చె..

- సందడి చేస్తున్న బసవన్నలు
- ఇంటింటా పిండివంటల ఘుమఘుమలు
- పతంగులతో యువత కేరింతలు



సంక్రాంతి వచ్చింది.. సంబురాలు తెచ్చింది.. ఆడపడుచుల ముత్యాల ముగ్గులు.. పతంగుల రెపరెపలు.. డూడూ బసవన్నల సయ్యాట.. వలస వెళ్లిన కూలీల రాకతో పల్లెలు కళకళలాడుతున్నాయి. సకినాలు, బొబ్బట్లు, పిండివంటలు నోరూరిస్తున్నాయి. ఇలా ధనిక, పేద తారతమ్యం లేకుండా సంక్రాంతి పండుగను ప్రతీ ఇంటా ఆనందంగా జరుపుకుంటారు. ఈ పండుగకు ప్రజలు కొత్త బట్టలు కొనకపోయినా.. కోటిదేవతలను పూజిస్తారు.



ఇల్లెందు: పతంగులు ఎగుర వేస్తున్న యువకులు

సండే స్పెషల్

ఇల్లెందురూరల్: సంక్రాంతి.. మగువలకు ముగ్గుల పండుగ. సూరీడు రాకముందే తన కళతో రోజును ప్రారంభించే యవతులు ముగ్గు అందాలను తనవితీరా చూసుకొని మురిసిపోతుంది. ఆ మురిపెం రోజంతా కొనసాగుతుంది. అందుకే సంక్రాంతి పండుగ వచ్చిందంటే యువతులు, మహిళలు రంగురంగుల ముగ్గులు వేయడం నేర్చుకుంటారు. పక్కింటి వాళ్లకంటే తాము వేసిన ముగ్గే బాగుండాలన్న పోటీతత్వం కనిపిస్తుంది. దీనికితోడుగా పలు సంఘాలు, సంస్థలు ముగ్గుల పోటీల నిర్వహణతోపాటు నేటి తరాలను సంస్కృతి పరిరక్షణ దిశగా ప్రోత్సహిస్తుండటం విశేషం.

**డూడూ బసవన్న..**

అయ్యగారికి దండం పెట్టు.. అమ్మ గారికి దండం పెట్టు.. అంటూ డూడూ బసవన్నలతో గంగిరెద్దుల వారు చేసే సందడి అంతాఇంతా కాదు. రైతులు పాలిచ్చే గోవును దైవంగా భావించి దానిని వస్త్రాలతో అలంకరించి కొత్తగా ఇంటికొచ్చిన ధాన్యాన్ని నైవేద్యంగా పెట్టడం అనవాయితీగా వస్తోంది. అయితే పట్టణ ప్రాంతాల్లో నేటి తరాలకు ఈ ప్రాధాన్యతను తెలియచేసేందుకు కొన్ని సంస్థలు కళాకారుల ద్వారా ప్రదర్శనలు ఇప్పిస్తున్నాయి.

**గాలిపటాలతో కేరింతలు...**

గాలిపటం కనిపిస్తే చాలు.. యువత కేరింతలు కొడుతూ.. సంక్రాంతి వేడుకలు పూర్తయ్యే వరకూ ఆనందంతో గంతులు వేస్తారు. అందుకే చిన్నారులకు అత్యంత ఇష్టమైన పండుగా నేటికీ సంక్రాంతి కనువిందు చేస్తోంది. పండుగ సందర్భంగా పతంగుల పోటీలు ప్రతీ ఒక్కరిలో నూతనోత్సాహం నింపుతుంది. వీరి ఆసక్తికి తగినట్టుగానే మార్కెట్‌లో రంగురంగుల గాలిపటాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి.

### పిండివంటల ఘుమఘుమలు

కొత్తగూడెంటౌన్: సంక్రాంతి అంటేనే నోరూరుంచే పిండి వంటల స్పెషల్. ఏ ఇంటికి వెళ్లినా, ఏ వీధుల్లోకి వెళ్లినా ఘుమఘుమలే. సంక్రాంతి పండుగకు ఇండ్లలో పిండి వంటలు చేయలేనివారు బయట షాపుల్లో కొనుగోలు చేస్తారు. కొత్తగూడెంలోని సూపర్‌బజార్, విద్యానగర్ కాలనీ, లక్ష్మీదేవిపల్లి, రుద్రంపూర్, బాబూక్యాంప్, హెడ్డాఫీసు ప్రాంతాల్లో సంక్రాంతి సందర్భంగా పిండివంటలను ప్రత్యేకంగా తయారు చేసి అమ్ముతూ మహిళలు ఉపాధి పొందుతున్నారు. కేజీ సకినాలు రూ.350, గారెలు, మురుకులు, లడ్డూలు రూ.250, అరిసెలు రూ.350 గంటల వ్యవధిలో తయారు చేసి కస్టమర్లకు అందజేస్తారు.



పిండివంటలు చేస్తున్న మహిళ

### ముగ్గుతో ఇంటికి అందం..



సంక్రాంతి పండుగ వచ్చిందంటే వాకిట్లో రంగురంగుల ముగ్గులు వేస్తాం. రోజూ కాగితాలపై, వాకిట్లో ముగ్గులు వేస్తూ ప్రాక్టీస్ చేస్తుంటాం. ముగ్గుల వల్ల ఇంటికి అందం వస్తుంది.

– పాయం హర్షిణి, బాలాజీనగర్, ఇల్లెందు

### ఆనందంగా ఉంటుంది..



గాలిపటం ఎగురవేయడం ఆనందంగా ఉంటుంది. సెలవులకు ముందే ప్లాన్ చేసుకుంటాం. స్నేహితులతో కలిసి పతంగులు ఎగురవేస్తాం. పతంగుల పోటీల్లో పాల్గొని ఎదుటి వారి పతంగి కంటే ఎక్కువ ఎత్తు ఎగురవేస్తాం.

– చీకుర్తి చరణ్, నెం.2బస్తీ, ఇల్లెందు

### గిరాకీ బాగుంది..



ఐదేళ్లుగా పిండివంటలు తయారు చేసి అమ్ముతాను. ప్రతీ పండుగకు ఆర్డర్లు వస్తుంటాయి. సంక్రాంతికి ఎక్కువగా వస్తుంటాయి. ప్రస్తుతం రోజుకు 15 నుంచి 20 ఆర్డర్లు వస్తున్నాయి. తన వద్ద పిండివంటలు తయారు చేస్తూ ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నాను.

– గుత్తుల ధనలక్ష్మి, శ్రీదుర్గ హోంఫుడ్స్, రుద్రంపూర్

### పండుగకు బిజీ..



సంక్రాంతి పండుగకు వారం నుంచే ఆర్డర్లు వస్తున్నాయి. ఆరేళ్లుగా పిండివంటలు తయారు చేసి అమ్ముతున్నాం. పిండి వంటలు కావలసిన వారికి కేజీల చొప్పున అందజేస్తాం. ఈసారి పండుగకు వారం నుంచే ఆర్డర్లు వస్తున్నాయి. పిండివంటలకు గిరాకీ బాగుంది.

– ఎస్.స్వప్న, లక్ష్మీ హోంఫుడ్స్ 4 ఇంక్లైన్, రామవరం

### హెచ్‌ఎంపీవీపై ఆందోళన వద్దు..



మాట్లాడుతున్న డాక్టర్ లలిత

సింగరేణి(కొత్తగూడెం): తాజాగా వినిపిస్తున్న వైరస్ హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) గురించి ప్రజలు భయపడాల్సిన పనిలేదని, కాకపోతే అందరూ విధిగా మాస్కులు ధరించి, శానిటైజర్ ఉపయోగించాలని సింగరేణి ఆరోగ్యశాఖ వైద్యురాలు డాక్టర్ లలిత పేర్కొన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని మైన్స్ ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్ (ఎంవీటీసీ), ఏరియా వర్క్‌షాపులో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ వైరస్ గురించి సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అంశాలపై భయాందోళన చెందరాదని, ఇతకంటే పెద్దవైరస్ కరోనా నుంచి మనమందరం బయట పడినట్లు చెప్పారు. ప్రధానంగా చిన్నపిల్లలు, వృద్ధులకు ఎక్కువగా ఇబ్బంది ఎదురయ్యే ప్రమాదముందని, వారిని బయటికి రాకుండా మాస్కులు, శానిటైజర్ వినియోగించటం మూలంగా దీనిని నివారించవచ్చన్నారు. రెండు, మూడు రోజులు జలుబు ఉంటే మాత్రం నిర్లక్ష్యం చేయకుండా, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

### మున్సిపల్ చైర్మన్‌కు సత్కారం



డీవీని సన్మానిస్తున్న డ్రైవర్లు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావును మున్సిపల్ టాటా మ్యాజిక్ డ్రైవర్లు, వర్కర్లు ఘనంగా సత్కరించారు. శనివారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంక్రాంతి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువతో సత్కరించారు. ఈ నెల 27న పాలకవర్గం పదవీ విరమణ ముగుయనున్నందున ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. డీవీ హయాంలో టాటా మ్యాజిక్‌లు వాటిలో పని చేసే కార్మికులకు ఎంతో మేలు జరిగిందని కార్మికులు తెలిపారు.

## గణతంత్ర వేడుకల నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాసరావు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 26న కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించనున్న 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై శనివారం జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కోడూరి శ్రీనివాస్‌రావు వివిధ విభాగాల అధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ వేడుకలకు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.బలరామ్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించాలన్నారు. పట్టణంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులతో కవాతు, మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అదే విధంగా వేడుకల్లో సింగరేణి వ్యాపిత ఉత్తమ ఉద్యోగుల సన్మానికి వచ్చే కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు, ఈ ప్రాంత ప్రజలకు, కార్మికులకు, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో కార్పొరేట్ ఏరియా సెక్యూరిటీ, సివిల్, ఈఅండ్ఎం, ట్రాన్స్‌పోర్ట్, ఫైనాన్స్, మెడికల్, పర్సనల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

### 24 గంటల పాటు చాలీసా పారాయణం

సింగరేణి(కొత్తగూడెం): ఏరియా పరిధిలోని వేంకటేశ్వరస్వామి గుట్ట మీద హనుమాన్ భక్త బృందం, స్థానికుల ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా హనుమాన్ చాలీసాను శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు 24 గంటలు నిర్వహించారు. 1000 మందికి అన్నదానం చేశారు.

### సురేష్‌రెడ్డికి అబ్దుల్ కలాం అవార్డు



అవార్డు అందుకుంటున్న సురేష్‌రెడ్డి

పాల్వంచ: పట్టణంలోని శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లా సురేష్‌రెడ్డికి సామాజిక సేవా కేటగిరిలో బహుజన సాహిత్య అకాడమీ కమిటీ ఆఫ్ ఇండియా నిర్వాహకులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు అందించారు. ఈ నెల 5న హైదరాబాద్‌లోని శ్రీ సుందరయ్య విజ్ఞాన భవనంలో జాతీయ కమిటీ ఆధ్వర్యంలో అవార్డు స్వీకరించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల సురేష్‌రెడ్డి అందుకోలేక పోయారు. దీంతో శనివారం బీఎస్పీ ఉమ్మడి జిల్లా నాయకులు ఆలువాల ప్రణీత్, సందీప్, రామ్‌కిషోర్‌లు స్వయంగా పాల్వంచలో నల్లా సురేష్‌రెడ్డిని కలిసి అవార్డు అందించి సన్మానించారు. కార్యక్రమంలో వెదిరే రామకృష్ణారెడ్డి, గడ్డం రవీందర్‌రెడ్డి, కొడుపుగంటి శ్రీనివాసరావు, శివ, రావుల కృష్ణ, ఆరెం ప్రశాంత్, అశోక్‌రెడ్డి, రామిరెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## శిక్షణలో మెళకువలు నేర్చుకోవాలి..



మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న అధ్యక్షురాలు వీసం రమ

ఇల్లెందు: సింగరేణి సేవా సమితి మహిళలకు వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ అవకాశాలు కలిపిస్తోందని దీనిని సద్వినియోగం చేసుకుని మెళకువలు నేర్చుకోవాలని సేవా సమితి అధ్యక్షురాలు వీసం రమ అన్నారు. శనివారం 24ఏరియా సేవా సమితి శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సేవా సమితి అందిస్తున్న వివిధ కోర్సుల శిక్షణ వల్ల ఎంతోమంది మహిళలు ఉపాధి పొందుతున్నారన్నారు. సింగరేణి ప్రభావిత గ్రామాల మహిళలకు, యువకులకు, సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, మాజీ ఉద్యోగుల పిల్లలు ఈ శిక్షణ తీసుకుని తమ కాళ్ల మీద తాము నిలబడగలుగుతున్నారని చెప్పారు. మహిళలు టైలరింగ్‌లో శిక్షణ పొందటం వల్ల ఎంతో ఉపయోగంగా మారిందన్నారు. నేటి ఆధునిక యుగంలో మహిళలు ఇంటి వద్ద ఏదో ఒక మెళకువతో కూడిన పని నేర్చుకోవడం వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్)జీవీ మోహన్‌రావు, సాయి స్వరూప్, కార్యదర్శి సులక్షణ తదితరులు పాల్గొన్నారు.

## ఐరన్ బ్రిడ్జి నిర్మాణానికి ఆటంకాలు!



నిలిచిపోయిన బ్రిడ్జి పనులు

ఇల్లెందు: ఇల్లెందులపాడు హిందూ శ్మశానవాటిక అలుగు వాగు మీద ఇనుప వంతెన పనులకు ఆటంకాలు ఎదురయ్యాయి. మున్సిపాలిటీ పాలకవర్గం గడువు ముగిసేలోపు పూర్తయ్యేనా అని పలువురు చర్చించుకుంటున్నారు. రెండేళ్లుగా ఇల్లెందు, ఇల్లెందులపాడు ప్రజలు అలుగు వాగు దాటి దహనసంస్కారాలకు వెళ్లడం కష్టంగా మారింది. వర్షాకాలంలో మృతదేహాలను అలుగు వాగు దాటించి ఖననం చేయటం ఎంతో కష్టంగా ఉంటుంది. ఈ విషయమై స్థానిక 2వ వార్డు కౌన్సిలర్ కటకం పద్మావతి పలుమార్లు మున్సిపల్ కౌన్సిల్‌లో పట్టుపట్టింది. అయితే తగినన్ని నిధులు లేవని బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేమని పాలకవర్గం తేల్చి చెప్పింది. ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లింది. అయితే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలంటే అధిక నిధులు కావాల్సి ఉండడంతో.. నిధుల వేటలో పడ్డారు. సింగరేణి సహకారంతో మిట్టపల్లి మసివాగు మీద తాత్కాలిక ఇనుప బ్రిడ్జి తరహాలో ఇల్లెందులపాడు హిందూ శ్మశానవాటిక కోసం అలుగు వాగు మీద బ్రిడ్జి నిర్మాణం చేయాలని అందుకు సింగరేణి సహకారం తీసుకున్నారు. నాటి జీఎం జాన్ ఆనంద్ సహకారంతో మైన్స్‌లో వాడి వదిలేసిన ఐరన్ పైపులతో తాత్కాలిక బ్రిడ్జిని నిర్మించాలని ఏర్పాట్లు చేసి, పనులు కూడా ప్రారంభించారు. వాగులో పిల్లర్ల నిర్మాణం చేశారు. సెంట్రింగ్ పెట్టి ఐరన్ ప్లేట్ వెల్డింగ్ చేయాల్సి ఉంది. కానీ ఈ పనులు ముందుకు సాగటం లేదు. ఈ నెలాఖరు నాటికి పాలకవర్గం పదవీకాలం ముగియనుంది. కానీ బ్రిడ్జి ఇప్పుడు పూర్తయ్యేలా లేదు. ఇప్పటికైనా అధికారులు, చైర్మన్ డీవీ, కాంట్రాక్టర్ వేగంగా పనులు పూర్తి చేయాలని కౌన్సిలర్ కటకం పద్మావతి కోరుతున్నారు.

## మారుపేర్లు సవరించాలి



మాట్లాడుతున్న నర్సింహారావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో అలియాస్ పేర్లతో ఉద్యోగంలో చేరిన కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని వీటిని త్వరితగతిన పరిష్కరించాలని, విజిలెన్స్ కేసుల వలన పెండింగ్‌లను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద వారి డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని సెంట్రల్ వర్క్‌షాపు గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ఆ రోజుల్లో ఉద్యోగంలో చేరే సమయంలో మారుపేర్ల మీద ఉద్యోగంలో చేరారని, తీరా సర్వీసు పూర్తయిన తరువాత వారి పిల్లలకు ఉద్యోగం ఇచ్చే క్రమంలో కొర్రీలు పెట్టటం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో 2020లో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, బీఎంఎస్, ఐదు కార్మిక సంఘాలు ఈ సమస్యపై ఏకాభిప్రాయానికి వచ్చి యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. కమిటీ వేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పి ఈరోజు దాటవేయటం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో బ్రాంచి నాయకులు విజయగిరి శ్రీనివాస్, గాజులు రాజారావు, వై.వెంకటేశ్వరరావు, కొత్తపల్లి రమేష్‌బాబు, గడల నరసింహారావు, నాజర్, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం



మాట్లాడుతున్న సత్యనారాయణ

కొత్తగూడెంఅర్బన్: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. రాజేందర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌లో గెట్ టు గెదర్ లెజెండ్స్ క్రికెట్ పోటీలలో రెండో రోజు శనివారం పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. బ్యాటింగ్ చేసి క్రీడాకారులను అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటలకు వయస్సుతో సంబంధం ఉండదని ఈ టోర్నమెంట్ ద్వారా నిరూపితమైందన్నారు. ప్రతీ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా జరగడం గొప్ప విషయమన్నారు. క్రికెట్ పోటీలు నిర్వహించడం ప్రస్తుత తరుణంలో అంత ఆషామాషీ విషయం కాదన్నారు. మొదటి మ్యాచ్ పుష్పరాజ్ లెవెన్ జట్టుకి, సన్ రైజర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సన్ రైజర్స్ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 62 పరుగులు చేయగా, పుష్పరాజ్ లెవన్ జట్టు 6 ఓవర్లలోనే 63 రన్స్ చేసి విజయం సాధించారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా పుష్పరాజ్ టీం బ్యాట్స్‌మెన్ ట్రాఫిక్ ఎస్.ఐ నరేష్‌కు న్యాయవాది పలివెల సాంబశివరావు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ట్రోఫీ అందజేశారు. తర్వాతి మ్యాచ్‌లో ఎన్ఎంసీసీ వర్సెస్ ఎంసీసీ జట్ల మధ్య జరగగా ఎంసీసీ జట్టు గెలుపొందింది. ఎంసీసీ జట్టు కెప్టెన్ సూర్‌రెడ్డి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు యర్రా కామేష్, లింగేశ్, బి.శ్రీను, బండి విజయ్ భాస్కర్, దుషాంత్, జంగా శ్యామ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



ఇల్లెందు:మార్గదర్శిని స్కూల్‌లో..

విద్యాసంస్థలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఫ్యాన్సీ డ్రస్సుల్లో అలరించాయి. ముగ్గులు, మెహందీ, పతంగుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బోగి మంటలు వేశారు. పలువురు మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంఅర్బన్: శ్రీరాగా స్కూల్‌లో...



ఇల్లెందురూరల్: ముగ్గులు పరిశీలిస్తున్న ఐద్వా, గిరిజన, రైతు సంఘం నాయకులు



పాల్వంచ: కేఎల్ఆర్ ఫార్మసీ కళాశాలలో...